


టిటిడి ఉద్యోగులకు క్రీడాపోటీలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టిటిడి ఉద్యోగుల క్రీడాపోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన పోటీల వివరాలు ఇలా ఉన్నాయి. 45ఏళ్లు పైబడిన మహిళల డాడ్జిబాల్ పోటీల్లో శోభారాణి విజేతగా నిలవగా, నిర్మల రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లలోపు మహిళల డాడ్జిబాల్ పోటీల్లో ద్రాక్షాయణి విజేతగా నిలవగా, పద్మజ రన్నరప్‌గా నిలిచారు. విశ్రాంత మహిళా ఉద్యోగుల బాల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో సుమతి లలితమ్మ జట్టు విజయం సాధించగా, భారతి, కృష్ణవేణి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విశ్రాంత పురుష ఉద్యోగుల బాల్‌బ్యాడ్మింటన్ ఫైవ్స్ పోటీల్లో బాలసుబ్రహ్మణ్యం జట్టు విజయం సాధించగా, గోపాల కృష్ణమూర్తి జట్టు రన్నరప్‌గా నిలిచింది.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయ్..!

ప్రజలే బుద్ధి చెబుతారు..

యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి- కార్వేటినగరం: జగన్ అరాచకపాలనలో అన్నిరంగాలు సంక్షోభంలో కూరుకుపోయాయని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం నాటికి 17వ రోజుకు చేరింది. శనివారం రాత్రి 10 గంలకు కొత్తూరులో లోకేష్ బస వద్దకు నారా లోకేష్ సతీమణి బ్రాహ్మణి, కొడుకు దేవాన్ష్ చేరుకుని కొంత సమయం పరామర్శించి రాత్రికి రాత్రే వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం కొత్తూరు నుంచి పాదయాత్ర ప్రారంభం అయ్యింది. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈడిగపల్లెలో గౌడ సామాజిక వర్గీయులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. 2గంటలకు కొత్తిరివేడు దగ్గర స్థానికులతో మాట్లాడారు. సాయంత్రం 4.20గంటలకు గొల్లకండ్రిక వద్ద స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే 5.40గంటలకు డీఎం.పురం గ్రామస్తులతో మాటామంతి జరిపారు. రాత్రి 7.50గంటలకు ద్వారకానగర్‌కు పాదయాత్ర చేరుకుంది. రాత్రి 9.05 గంటలకు శ్రీవెంకటేశ్వర పెరుమాల్ ఇంజనీరింగ్ కాలేజీ ఎదురు విడిది కేంద్రంలో లోకేష్ బస చేశారు. మండలంలోని కొత్తురు, అలత్తురు క్రాస్‌రోడ్డు, టిటి కండ్రిగ, అమ్మపల్లి క్రాస్‌రోడ్డు, ఈదువారిపల్లి, వత్తులురు, గొల్లకండ్రిగ, కెఎం.పురం, ఎస్‌ఎన్ కండ్రిగ, సురేంద్రనగరం, దాసరిగుంట మీదుగా పాదయాత్ర సాగింది. మహిళలు యువత కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల టిడిపి విజయం సాధించి పెట్రోల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉందన్నారు. పాదయాత్రకు ప్రజలతో మమేకమై ఉండాలని మైకు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకొని నడిపిస్తుందని దుయ్యబట్టారు. అమర రాజా ఫ్యాక్టరీలో ఎందరో యువత ఉద్యోగాలు చేసుకుంటూ ఉంటే అలాంటి ఫ్యాక్టరీ తెలంగాణకు తరిమికొట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. యాదవులకు గతంలో టిడిపి ప్రభుత్వంలో టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.

అలత్తురు వద్ద లోకేష్ బాబుకు టిడిపి నాయకులు ప్రకాష్ శాలువాలు కప్పి సన్మానించారు. కరీంనగర్ మండలం మాజీ వైస్ఎంపీపీ రవికుమార్ ఆధ్వర్యంలో లోకేష్ బాబు యువగళం పాదయాత్రకు బైక్‌ర్యాలీ నిర్వహించి సంఘీభావం తెలిపారు. కెఎంపురంలో పట్టెం జ్యోతిసోమశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలు తరపున హారతులు పట్టారు. ఎస్ఎన్ కండ్రిగ వద్ద వై.రాధాకష్ణ యాదవ్ ఆధ్వర్యంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. టిటి కండ్రిగ క్రాస్ వద్ద టిడిపి యువనాయకుడు వి.యువరాజ్ ఆధ్వర్యంలో క్రేన్ సహాయంతో లోకేష్ బాబుకు గజమాలతో స్వాగతం పలికారు. మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు పులివర్తినని, జీడి.నెల్లూరు ఇంచార్జ్ చిట్టిబాబు నాయుడు, జిల్లా యువత అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మీడియా కోర్డినేటర్ కిషన్ చంద్, నాయకులు పాచిగుంట మనోహర్ నాయుడు, చెంగల్రాయల్ యాదవ్, రాజేంద్రరెడ్డి, నాగేశ్వరరాజు, పర్వేజ్, దాసరి గణేష్, పరంధామ్, ధనగిరి, వాసుదేవరెడ్డి, ఏకాంబరం, ప్రసాద్, రకుబాబు, మోహన్, రవి యాదవ్, రవికుమార్, గ్యాస్ రవిరాజు, సోము, మురళి, వెంకటముని, మునికృష్ణ, ఈశ్వర్, కుమారస్వామి రాజు పాల్గొన్నారు.



పాదయాత్రలో మహిళలతో సెల్ఫీ దిగుతున్న లోకేష్



నారా లోకేష్‌ను శాలువతో సత్కరిస్తున్న నాయకులు



సమస్యలపై మాట్లాడుతూ..

తిరుమలలో పోటెత్తిన భక్తులు

సర్వదర్శనానికి 25 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ బాగా పెరిగింది. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో స్వామివారి దర్శనానికి ఎక్కువ సమయం పడుతుంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయి భక్తులు బయట టీబీసీ వరకూ క్యూ లైన్‌లో వేచి ఉన్నారని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. సర్వదర్శనం టోకెన్లులేని భక్తులకు స్వామివారి దర్శన సమయం 25గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ప్రత్యేక దర్శనం మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు స్వామివారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుంది. శనివారం శ్రీవారిని 75,728మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. వీరిలో 38,092 మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం 4.15కోట్ల రూపాయలు వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు.

నారా లోకేష్ నన్నెక్కడా విమర్శించ లేదు

ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

తిరుమల: రాష్ట్రంలో వెన్నుపోటుదారులు ఏకమవుతున్నారనీ, జగన్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు చెంతకు కొందరు చేరుతున్నారని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శనసమయంలో ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ వ్యక్తిగతంగా ఎక్కడ కూడా తనని విమర్శలు చేయలేదని, తన సామాజిక వర్గం, బెంగుళూరు నుంచి తెచ్చుకున్న ఓ ముఠా రెచ్చగొట్టే కార్యక్రమం చేస్తున్నారనీ ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో పేదల ఇంటి నిర్మాణం మొదటి దశ పనులు కూడా మొదలుపెట్టలేనీ స్థితిలో ప్రభుత్వం ఉందని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబు ఇస్తూ గతంలో చంద్రబాబు నాయుడు ఓటు కోసం పేదల నెత్తురు తాగరాన్నారు. 3650 ఇళ్లకు ముఖ్యమంత్రి జగన్ డబ్బులు త్వరలో విడుదల చేస్తారని తెలిపారు.



శ్రీవారి ఆలయం ఎదుట ఉప ముఖ్యమంత్రి

మండలి ఎన్నికల దృష్ట్యా

డయల్ యువర్ కమిషనర్, స్పందన రద్దు

కమిషనర్ అనుపమ అంజలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి జరగనున్న ఎన్నికలు దష్ట్యా మార్చి 22 వరకు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ కమిషనర్ అదేవిధంగా అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తదుపరి డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం మార్చి 27 సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించగలరని కమిషనర్ అనుపమ అంజలి కోరారు.

భూకంప సహాయార్థం ర్యాలీ విజయవంతం



భూకంప బాధితులకు సహాయార్థంగా ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: టర్కీ, సిరియా దేశాల్లో భూకంప బాధితుల ప్రతిఒక్కరూ సహాయం చేయాలని ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ రీచ్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల, తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ భూకంపంలో వేలాదిమంది నష్టపోయారని వారిని ఆదుకోవాల్సి బాధ్యత మన అందరిపై ఉందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వారికి సాయం చేసేందుకు తన వంతు సాయం చేయాలని కోరారు. భూకంపం వల్ల లక్షలాది మంది ఆస్తి ప్రాణనష్టం సంభవించిందని, భారత్ ప్రభుత్వం కూడా బాధితుల అనేకరకాల సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, జెసిఐ కొన్ని స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో టర్కీ, సిరియా భూకంప బాధితుల సహాయార్థం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తుడికే తొలిపూజ

నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:

భగవంతుడికన్నా గొప్పవాడు లేరంటారు.. అయితే భగవంతుడికన్నా భక్తుడే మిన్నని పరమశివుడు నిరూపించాడు. మూఢభక్తితో కొలిచిన బోయవాడైన తిన్నడికి మోక్షం ప్రసాదించి కన్నప్ప అనే పేరు పెట్టారు. శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు కన్నప్ప ధ్వజారోహణం జరుగుతుంది. ఈ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు స్వామివారి ధ్వజారోహణం జరగనుంది. భగవంతుడికన్నా భక్తుడే మిన్న అని ఈ సంఘటన నిరూపిస్తోంది.

నేపథ్యం...

కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధమైన అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం సాధించడానికి తపస్సు చేశాడు. అర్జునుడిని పరీక్షించడానికి కైలాసవాసుడు బోయవాని వేషంలో పందిని వేటాడుతూ వచ్చి అర్జునుడితో తలపడతాడు. విలువిద్యలో మేటి అయిన అర్జునుడు వేసిన బాణాలన్నీ వ్యర్థమయ్యాయి. చివరకు తప్పును గ్రహించి క్షమించమని వేడుకున్నాడు. తర్వాత యుగంలో బోయవాడిగా జన్మించి తనను పూజిస్తే మోక్షం కలుగుతుందని శివుడు వరమిచ్చాడు. దాని ప్రకారం జన్మించాడు. దక్షిణకైలాసమైన శ్రీకాళహస్తి క్షేత్రంలో వాయులింగాన్ని పూజించి కళ్లను దానం చేసి కన్నప్పగా ప్రఖ్యాతి చెందాడు. ఆనాటి నుంచి కొండపై ఉన్న కన్నప్పకు మొదటి పూజ జరుగుతోంది.

13వ తేదీ నుంచి ఉత్సవాలు..

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13వ తేదీన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14న స్వామివారి ధ్వజారోహణం, 15న దిన భూతశుకవాహన సేవ, 16న రావణ -మయూర వాహనసేవ, 17న శేష-యాళి. హన సేవ జరగనుంది. 18న మహాశివరాత్రి జరగనుంది. అదేరోజు నందిసేవోత్సవం, అర్ధరాత్రి తర్వాత లింగోద్భవముంటాయి. 19న ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం, 20న స్వామి, అమ్మవార్ల కల్యాణం, సభాపతి కల్యాణం, 21న కైలాసగిరి ప్రదక్షణం, 22న ధ్వజావరోహణం, 23న పల్లకిసేవ, 24న ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయి. 25న శాంతి అభిషేకాలు నిర్వహిస్తారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకుందాం..!

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి




సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గాలలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) తరపున పోటీ చేస్తున్న గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి బాబురెడ్డిల విజయం కోసం సిఐటియు వివిధ ప్రజాసంఘాల కార్యకర్తలు పట్టుదలతో పోరాడి విజయం సాధించేందుకు దోహదపడాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కందారపు మురళి పిలుపునిచ్చారు. స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని ఉపాధ్యాయ భవన్‌లో సిఐటియు ఇతర ప్రజాసంఘాల కార్యకర్తల విస్తత సమావేశం ఆదివారం నాడు జరిగింది. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి కందారపు మురళి ప్రసంగిస్తూ అధికార పార్టీ నాయకులు తమ అభ్యర్థుల విజయం కోసం అడ్డదారులు తొక్కి, తప్పుడు ప్రయత్నాలు తీవ్రంగా చేస్తున్నారని ప్రభుత్వానికి ఉన్న అన్ని అంగాలను వినియోగించుకొని గెలుపుకు పడరాని పాట్లు పడుతున్నారని విమర్శించారు. డబ్బులతో, అధికార దుర్వినియోగంతో గెలుపుకై చేస్తున్న ప్రయత్నాలు విఫలం కాక తప్పదని ఆయన జోస్యం చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న పార్టీ నేతలు ఇదే మాదిరి ప్రయత్నించి ఘోరంగా విఫలమైన ఘటనను గుర్తుచేశారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల్ని దగ్గరగా పరిశీలించే ఏ విద్యాధికుడైనా, అధికార పార్టీ అభ్యర్థులను ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించకపోతే, రాష్ట్ర ప్రయోజనాలను ఆశించిన వారు కాదని కందారపు మురళి అన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో చేతులు కలిపి రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నష్టపరిచిన వైసిపి నాయకులకు పెద్దలసభలో అడుగుపెట్టే అర్హత లేదని తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోతగుల సమస్యల పరిష్కారంలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరచిపోయి ప్రవర్తిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతినెలా జీతాలు ఇవ్వడం చేతగాని వారు ఉద్యోగులకు మేలు చేస్తామని అంటే, నమ్మటం ఎలా..? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల పట్ల, ఉద్యోగుల పట్ల ఈప్రభుత్వం అనుసరిస్తున్న ధోరణి అమానుషంగా ఉందని గుర్తు చేశారు. గ్రాడ్యుయేటు, ఉపాధ్యాయ నియోజకవర్గాలలో అనర్హులను ఓటర్లుగా చేర్చి ఆ ఓట్లతో ఎమ్మెల్సీ పగ్గాలను చేపట్టాలన్న ప్రయత్నం సిగ్గుచేటని అన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఖాయం చేసుకున్న వైసిపి... ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల్లో సైతం అడ్డదారిలో గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నదని, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాలలో సైతం వైసీపీ పెద్దలు ఉండాలనుకోవడం దారుణమని విమర్శించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యాధికులు, ఉపాధ్యాయులు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యం అనే స్ఫూర్తికి జగన్ ప్రభుత్వం తిలోదకాలు ఇస్తున్న తీరును ఎదుర్కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్రనేత ఎస్ఎస్.నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జనార్ధన్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవ్, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, టీటీడీ నాయకులు వెంకటేశం, నాగార్జున, ఆర్టీసీ నాయకులు ఇఎస్ కుమార్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మార్చి 22 నాటికి 24 వేల ఇళ్లు ప్రారంభం

వై.వెంకటేశ్వర రావు
తిరుపతి జిల్లా హౌసింగ్ అధికారి



ప్రజాశక్తి- తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పేదలందరికీ ఇళ్లు నవరత్నాల్లో భాగంగా జగనన్న కాలనీల్లోని గృహనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు వై.వెంకటేశ్వరరావు, తిరుపతి జిల్లా హౌసింగ్ ఈఈ జిల్లా అధికారి తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లోని గృహనిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని మార్చి 22 నాటికి జిల్లాలో 24వేలు ఇళ్లు పూర్తి చేసి గృహప్రవేశాలు చేపట్టాలని తెలిపారు. ఈ మేరకు అన్ని శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటిరకు 69,291 గృహాలు లబ్ధిదారులకు మంజూరైనట్లు తెలిపారు.

ప్రశ్న: ఇళ్లు కట్టుకోవడానికి ఇచ్చిన సబ్సిడి ఎంత..?

హౌసింగ్ ఈఈ: 340 చదరపు అడుగులు (ఒక యూనిట్) ధర రూ.1,80,000లు మంజూరు చేయబడింది. అందులో 90 బస్తాల సిమెంట్, 343 కేజీల కమ్మి, 20 టన్నుల ఇసుక ఇవ్వడం జరిగింది.

ప్రశ్న: బ్యాంకుల నుండి రుణ సదుపాయం ఎలా ఇస్తున్నారు..?

హౌసింగ్ ఈఈ: పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉంటే రూ.35 వేల నుండి లక్ష వరకు బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పిస్తున్నాము.

ప్రశ్న: లేఅవుట్లు, సొంతస్థలాల్లో గృహాలు ఎన్ని నిర్మాణంలో ఉన్నాయి?

హౌసింగ్ ఈఈ: లేఅవుట్లలో 51028, సొంత స్థలాల్లో 18263 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి.

ప్రశ్న: గృహప్రవేశాలు ఎప్పుడు..?

హౌసింగ్ ఈఈ: రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 22 ఒక పండుగలా 5లక్షల ఇళ్లకు గృహప్రవేశం ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించబడును. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో 24756 ఇళ్లకు గృహప్రవేశం జరుగుతాయి

ప్రశ్న: గృహాల కోసం ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఎన్ని?

హౌసింగ్ ఈఈ: అర్హులందరికీ గృహాలు మంజూరు చేయడం జరిగింది. కొన్ని కారణాల వలన ఇంకా 6900 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీరికి కూడా వీలైనంత త్వరగా ఇళ్లు మంజూరుచేస్తాము.




తిరుపతిలోని అవిలాల వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ఆరోగ్య క్రమశిక్షణతో మెరుగైన సమాజం

డాక్టర్ శ్రీభూషణ్ రాజు

రెండోరోజు టిటిడి ఉద్యోగుల అవగాహన సదస్సు



ప్రజాశక్తి-క్యాంపస్: జీవితంలో ఆరోగ్య క్రమశిక్షణ అంతర్భాగం కావాలని, తద్వారా ఆరోగ్యకరమైన మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని హైదరాబాదుకు చెందిన నిమ్స్ చీఫ్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శ్రీభూషణ్ రాజు తెలిపారు. జీవనశైలిని మార్చుకోకపోతే రాబోయే కొన్నేళ్లలో దేశం క్యాన్సర్ ముప్పును ఎదుర్కోక తప్పదని ఇతర వైద్యులు హెచ్చరించారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో టిటిడి ఉద్యోగులకు జీవనశైలి రుగ్మతలు, వ్యాధులు అనే అంశంపై జరుగుతున్న అవగాహన సదస్సు ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీభూషణ్ రాజు మాట్లాడుతూ డయాబెటిస్ వ్యాధిని నిశ్శబ్ద సునామీగా అభివర్ణించారు. 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరూ డయాబెటిస్ పరీక్షలు చేయించుకోవాలని, త్వరగా గుర్తిస్తే ఎక్కువ నష్టం కలగకుండా చూసుకోవచ్చని చెప్పారు. డయాబెటిస్ ఉన్నవారికి కిడ్నీ, నరాలు, గుండె, నేత్ర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. శరీరంలో కిడ్నీలు సమర్థవంతమైన పాత్రను పోషిస్తాయని, మలినాలను తొలగించి శరీరానికి సమతాస్థితిని కలిగిస్తాయని చెప్పారు. రోజుకు ఐదుసార్లు తక్కువగా తినాలని, సాయంత్రం 6 గంటలకల్లా రాత్రి భోజనం ముగించాలని సూచించారు. ఎస్వీ ఆయుర్వేద ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యవిధానాల ద్వారా జీవనశైలి రుగ్మతలు, వ్యాధులను చక్కగా ఎదుర్కోవచ్చన్నారు. స్థూలకాయం, డయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులకు అందుబాటులో ఉన్న ఇంటిచిట్కాలు, ఆయుర్వేద ఔషధాలను వివరించారు. అల్లోపతి చికిత్స పొందుతున్నప్పుడు, ఆయుర్వేద వైద్యాన్ని కూడా పొందవచ్చని, ఇంటిగ్రేటెడ్ మెడిసిన్ ప్రాముఖ్యతను తెలియజేశారు. నల్లేరు, కలబంద, ఉసిరి, అర్క, జిల్లేడు తదితర సులభంగా లభించే మొక్కల ప్రాముఖ్యతను ఆమె వివరించారు. ఆరోగ్యవంతమైన జీవనం కోసం ఆయుష్ మంత్రిత్వశాఖ ఆమోదించిన 314 ఉత్పత్తులను టిటిడి ఆయుర్వేద ఫార్మసీ త్వరలో అందుబాటులోకి తీసుకురానుందని చెప్పారు. డాక్టర్ సుబాషిణి మాట్లాడుతూ కార్డియాక్ అరెస్ట్ అయి స్పృహకోల్పోయిన వారికి ప్రథమచికిత్సగా చేయాల్సిన సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) ప్రక్రియ గురించి తెలియజేశారు. ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు పలు అన్నమయ్య సంకీర్తనలకు చక్కగా నృత్యాభినయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వి వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, స్విమ్స్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ జగదేక ప్రతాప్, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, ఇఇ మనోహరం, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్ రెడ్డి, గోవిందరాజన్, ఆనందరాజు, డిఎఫ్ఓ శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయలసీమ నీటి కోసం

సంఘటితంగా పోరాటం చేద్దాం

నవీన్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాయలసీమ నీటికోసం సంఘటితంగా పోరాడుతామని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తన కార్యాలయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పిలుపుమేరకు రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పరిధిలోని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామికి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డికి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి, రాజంపేట శాసనసభ్యులు మేడ మల్లికార్జున్ రెడ్డికి రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి స్టీరింగ్ కమిటీ సభ్యులు కలసి వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. రాయలసీమలోని నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం వద్ద కష్ణా నదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఐ కానిక్ (తీగల) వంతెనకు బదులు బ్యారేజ్ కం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలన్న డిమాండ్ చేశారు. అలాగే కర్ణాటకరాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న అపర్ భద్ర ప్రాజెక్టు కారణంగా భవిష్యత్తులో రాయలసీమలోని అన్నీ జిల్లాలలో తాగునీరు సాగునీరు లేక ఎడారిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమ జిల్లాలలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికార, ప్రతిపక్షపార్టీ నాయకులు జెండాలు అజెండాలు పక్కనపెట్టి ప్రభుత్వపరంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.రాయలసీమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై సీమప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపిలు ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడం శుభపరిణామమని తెలిపారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రతిఒక్కరూ ఉదయం లేవగానే గంటపాటు నడక, వ్యాయామం చేయడంతో సంపూర్ణం ఆరోగ్యం పొందవచ్చని వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వాకర్స్ భవనంలో అధ్యక్షులు రామచంద్రనాయుడు అధ్యక్షతన వాకర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే నడక ముఖ్యమని..అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే వాకర్స్ అసోసియేషన్ భవనం వద్ద రేకులు వేసుకునేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కోశాధికారి గుణశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మురుగేషన్‌రెడ్డి, రఘునాథంరెడ్డి, కృష్ణంరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



ప్రజాశక్తి -గూడూరు: గూడూరు రెండో పట్టణం పరిధిలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం నవోదయ ప్రవేశ (మాదిరి) పరీక్ష నిర్వహించారు. అలాగే శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సి.వి.రన్ టాలెంట్ టెస్ట్ జరిగింది. కార్యక్రమంలో అకడమిక్ డీన్ సునీల్, కోఆర్డినేటర్ హరికష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి సాయి సింధు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ




ప్రజాశక్తి-రేణిగుంట: పేద ప్రజలకు సేవ చేయడమే చేయూత సోషల్ సర్వీస్ ముఖ్య ఉద్దేశమని సంస్థ అధ్యక్షురాలు డీఎం ప్రత్యూష అన్నారు. రేణిగుంట మండలం వెదలచెరువు ఎస్టీ కాలనీలో ఆదివారం చేయూత సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో వద్దులకు దుప్పట్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి శ్రీనివాసులు, ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, ఆషా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములు రాజు, మునెమ్మ, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదలకు సైతం మెరుగైన వైద్యమే లక్ష్యంగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజిఎం హాస్పిటల్స్ సంయుక్తంగా తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు వంద మంది గ్రామస్థులు శిబిరంలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. వైద్యులు ఉచితంగా మందులు, సలహాలు, సూచనలు అందజేశారు. వైస్ ఎంపీపీ పెద్దాసరి గెరటారెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్, గౌరవాధ్యక్షుడు వీసీ వెంకటయ్య, సహాయ కార్యదర్శి బత్తెయ్య, ఏపీఆర్వో నత్తం హరిబాబు, ఎంజీఎం వైద్యులు దినేష్, జంబు రాజన్, రూపేష్, దిలీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ వ్రతం



ప్రజాశక్తి-ఓజిలి: గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మండలంలోని మానమాల గ్రామంలోని సాయిబాబా ఆలయ నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, ఉచ్చూరు శోభారాణి దంపతులు ఆదివారం ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని సాయిబాబా ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

నాగరాజు మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నింద్ర మండలం శ్రీరామాపురం బీసీ కాలనీకి చెందిన వైసీపీ కార్యకర్త నాగరాజు శనివారం రాత్రి గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు శ్యామ్‌లాల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గాయపడిన టీడీపీ కార్యకర్తకు పరామర్శ



ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: వడమాలపేట మండల పరిధిలోని తిరుమణ్యం గ్రామపంచాయతీలోని టీడీపీ యువ నాయకులు జ్యోతిరెడ్డి చెట్టుపై నుంచి పడిపోవడంతో గాయపడ్డాడు. ఆదివారం వడమాలపేట మండల పార్టీ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు అధికారి ప్రతినిధి ధనుంజయ నాయుడు, రాష్ట్ర టిఎన్టియుసి కార్యదర్శి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఉదయ్ శివరాయల్, చైతన్య పాల్గొన్నారు.

గాజులమండ్యాన్ని మాండవ్య మహర్షిపురంగా చేస్తా..!

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి





ప్రజాశక్తి- రేణిగుంట: గాజులమండ్యం గ్రామానికి మాండవ్య మహర్షిపురంగా పేరు మార్పునకు కృషి చేస్తానని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గాజులమండ్యం స్వర్ణముఖి నది తీరాన దాతలు జువ్వల మోహనరామిరెడ్డి, జయలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో నూతనంగా రూ.1.5 కోట్లతో నిర్మించిన శివానంద ధామాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో పవిత్రమైన సువర్ణముఖి నది తీరాన శివానంద ధామాన్ని నిర్మించారని కొనియాడారు. గాజులమండ్యం గ్రామం వాస్తవ్యులు ప్రముఖ సైకియాట్రిక్ డాక్టర్ జువ్వల మోహన రామిరెడ్డి జయలక్ష్మి దంపతులు అమెరికాలో స్థిరపడ్డారన్నారు. సొంతూరుకు ఏదైనా చేయాలన్న సంకల్పంతో శివానంద ధామం నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. ఎందరో మహనీయులు గాజులమండ్యం గ్రామంలో జన్మించి ఐఎఎస్, డాక్టర్లుగా దేశ విదేశాల్లో స్థిర పడినట్లు ఆయన తెలిపారు. గాజులమండ్యం గ్రామస్థుల కోరిక మేరకు గ్రామానికి పేరు మార్పునకు కషి చేస్తానన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే పెట్టుకోవాలని.. గ్రామాభివద్ధికి అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 30 సంవత్సరాలుగా శ్రీకాళహస్తిని ఏ రాజకీయ పార్టీ నాయకులు పట్టించుకోకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా శ్రీకాళహస్తి స్వర్ణముఖి నది తీరాన 12 ఎకరాలలో ముక్తి ధామాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తిలో కొండచుట్టూ గిరిప్రదక్షిణకు రోడ్లు లేకుండా అస్తవ్యస్తంగా ఉందని.. 21 కిలోమీటర్లు సిమెంటు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి స్వర్ణముఖి నదిలో డ్యామ్‌ల నిర్మాణం చేపడతామన్నారు. శ్రీకాళహస్తి ప్రాంత రైతులకు 365 రోజులు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రికి దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.80 లక్షలతో పూల డెకరేషన్ చేస్తున్నామని తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో రూ.14 కోట్లతో అండర్ గ్రౌండ్ కరెంటు కేబుల్ నిర్మాణం చేపట్టామన్నారు. చెన్నైకు వెళ్తున్న తెలుగు గంగ నీళ్లను శ్రీకాళహస్తి ప్రజల కోసం రూ.కోటి వ్యయంతో 12000 ఎకరాలకు నీరు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎవరు మతిచెందినా తమ కుటుంబం నుంచి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమి చేయలేరన్నారు. ఏర్పేడు వ్యాసాశ్రమాన్ని అభివద్ధి చేయాలని స్వామీజీ పరిపూర్ణానంద స్వాములు వారిని కోరారు. కార్యక్రమంలో వైకాపా మండల ఇన్‌ఛార్జి బియ్యపు పవిత్ర రెడ్డి, ఎంపీపీ కలపాటి హరిప్రసాద్ రెడ్డి, జడ్పిటిసి సంధ్యారాణి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, గౌతమి, వ్యాసాశ్రమం పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి, డాక్టర్ ప్రశాంతి, రెడ్డి సంఘం అధ్యక్షురాలు సుమతి, మూలస్థానేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తలు జువ్వల ధనంజయ రెడ్డి, మల్లవరం నరేందర్ రెడ్డి, గాజులమండ్యం ప్రముఖులు పన్నీరు కాల్వ శ్రీధర్ రెడ్డి, జువ్వల ధన కుమార్ రెడ్డి, జువ్వల దయాకర్ రెడ్డి, జువ్వల లీలా రెడ్డి, ధరణీశ్వర్ రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, సర్పంచులు నగేషం, ముని శేఖర్ రెడ్డి, లక్ష్మీపతి రెడ్డి, వైస్ ఎంపిపి సుజాత, మండల కో ఆప్షన్ సభ్యులు సుభాన్ రాజా, మండల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి, దళిత నాయకురాలు అరుణ, జ్యోతి, బుజ్జమ్మ, నల్ల పాలెం శ్రీనివాసులు, ఎంపిటిసి ఆనందరావు వార్డు మెంబర్ లక్ష్మి, రసూల్, ఇన్బనాథన్, సూరిబాబు, ఎంపీటీసీ సుందర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడలు విద్యార్థులకు అవశ్యం




ప్రజాశక్తి-క్యాంపస్: తైక్వాండో క్రీడలు విద్యార్థులకు అవశ్యమని తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్ మైదానంలో తిరుపతి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రథమ ఓపెన్ సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్షిప్ టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, తిరుపతి మేయర్ డాక్టర్ బి.శిరీష, తిరుపతి జిల్లా తైక్వాండో ప్రెసిడెంట్ గురవారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పోటీ ప్రపంచంలో తైక్వాండో భారత్ పోటీలు కూడా ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి నాలుగు రాష్ట్రాల నుంచి 500 మంది తైక్వాండో విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన క్రీడాకారులకు, కోచ్‌లకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ముఖ్య అతిథులు ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.బాబు, విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి, తిరుపతి జిల్లా తైక్వాండో సెక్రెటరీ పీ.విజయ్ కుమార్, జాయింట్ సెక్రెటరీలు ఎం.లోకాభిరాం, మహుమద్, ట్రెజరర్ బీబీ యుగంధర్ రెడ్డి, టెంపుల్ ఆఫ్ తైక్వాండో భారత్ అధ్యక్షురాలు పీ.గీత మరియు ట్రెజరర్ ఎం.సునీత, జీ.దేవ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: పట్టుదలతో చదివితే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్షేమ అధికారులు రామయ్య, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల వస్తుండటంతో విద్యార్థులు భయం విడనాడి చదువుపై దష్టి సారించాలని తెలిపారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. బుచ్చినాయుడు కండ్రిగ, తొట్టంబేడు, వెంకటగిరి, నాగలాపురం, పిచ్చాటూరు, సత్యవేడు, వరదయ్యపాలెం మండలాలకు చెందిన విద్యార్థులు, వార్డెన్లు విజయ కుమారి, శ్రీలక్ష్మీ, గీత, గంగాధర్, అన్నపూర్ణ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అభినందనీయం



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు జడ్పీ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం అభినందనీయమని పాఠశాల అభివద్ధికి తమ సహకారం అందిస్తామని నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ అన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన శతాబ్ది వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలను అందంగా తీర్చిదిద్దారు. శతాబ్ది వేడుకలకు పూర్వపు విద్యార్థులు భారీగా తరలివచ్చారు. జడ్పీ ఛైర్మన్ ఆనం అరుణమ్మ వంద సంవత్సరాల పైలాన్ ను ఆవిష్కరించారు. పాఠశాల స్థాపనకు పెళ్లకూరు దశరథరామిరెడ్డి అందించిన దాతత్వం మరువలేనిదని తెలిపారు. పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో చదివి నేడు ఎంతోమంది ఉన్నత స్థాయిలో ఉన్నారని.. వారందరి సహకారంతో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, త్రివిక్రమ్, గోపాల్ రెడ్డి, రవుఫ్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.10 వేలు అందించాలి



ప్రజాశక్తి -సత్యవేడు: రాష్ట్రవ్యాప్తంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు రూ.10 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని సిఐటియు సత్యవేడు మండల అధ్యక్షుడు అరుణాచలం డిమాండు చేశారు. స్థానిక సత్యవేడు సీఐటీయూ కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కరోనా కాలం నుంచి భవన నిర్మాణ కార్మికులు చేయడానికి పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని.. నిరంతరం పెరుగుతున్న సిమెంటు, ఇసుక, ఇనుము, కలప మొదలగు వాటి ధరలు పెరగడంతో కార్మికులకు వారానికి మూడు రోజులు మాత్రమే పని దొరుకుతుందని ఆర్థిక ఇబ్బందులతో అప్పులు చేసి కుటుంబ భారాన్ని వెళ్లదీస్తున్నారని వాపోయారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. భవన నిర్మాణ కార్మికులు సంఘటితం కోసం ఫిబ్రవరి 19న జరిగే సత్యవేడు మండలం మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు తిరుమల రెడ్డి, వేలు, కృష్ణమూర్తి, ఢిల్లీ,బాబు, చిరంజీవి, మురుగన్, రమేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ రఫీకి అంత్యక్రియలు




ప్రజాశక్తి-ఓజిలి: ఓజిలి పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న షేక్ రఫీ గుండెపోటుతో ఆకస్మికంగా ఆదివారం ఉదయం మతి చెందారు. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి పోలీస్ కుటుంబ సభ్యులతో సాయంత్రం పోలీసు అధికార లాంఛనాలతో రఫీకి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసుశాఖలో సమర్ధవంతంగా సేవలందించిన రఫీకి ఇంకా పది సంవత్సరాలు సర్వీసు ఉండగా ఆకస్మికంగా మతిచెందడం బాధాకరమన్నారు. పోలీసులు, బంధువులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులకు ఇంటి సరుకులు పంపిణీ చేశారు. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్ హాజరై దివ్యాంగులకు ఇంటి సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కుల,మతాలకతీతంగా 134 నెలలుగా దివ్యాంగులకు ఇంటి సరుకులు పంపిణీ చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలు అభినందనీయం అన్నారు. ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ బాషా, సంస్థ వ్యవస్థాపకుడు మునీర్ భాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, కొల్లూరు హరి నాయుడు, బాబా ఫరీద్, ఢిల్లీ కుమార్, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తలకోన బోర్డు ఛైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి మృతి



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: తలకోన బోర్డు ఛైర్మన్ ఉమామహేశ్వర్ రెడ్డి గత కొద్ది కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఎల్లమంద గ్రామ పంచాయతీకి చెందిన ఆయన గతంలో పలుమార్లు సర్పంచ్‌గా, సింగిల్ విండో ఛైర్మన్‌గా, ప్రస్తుతం తలకోన బోర్డు ఛైర్మన్‌గా పనిచేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ప్రజాశక్తి-పలమనేరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంజిత్ షా తెలిపారు. ఫ్రెండ్స్ ప్రీమియం లీగ్ తరపున కిషోర్ నిర్వహించిన లెదర్ బాల్ టోర్నమెంట్ ఆదివారం పట్టణంలో ఫైనల్‌ని నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన రంజిత్ షా మాట్లాడుతూ...క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా చాలా మంచిదని తెలిపారు. విద్యార్థి దశ నుండే క్రీడలు ఆడడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఫాల్కన్స్ వింగ్స్ టీమ్ సూపర్ కింగ్స్‌ను ఓడించి విజేతగా నిలవడం జరిగింది. విజేతలకు బహుమతులు అందించారు. విన్నర్స్ ట్రోఫీని స్వగహా స్వీట్స్ యజమాని శివ, రఘునాథ్, రంజిత్ షా, సుబ్రమణ్యం, హరికష్ణ చేతుల మీదుగా విన్నర్ కెప్టెన్ షోయబ్ కు అందచేశారు. రన్నర్స్ ట్రోఫీని హరి చేతుల మీదుగా సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ నూతన్‌కు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ షోయబ్‌కు దక్కింది.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల పరిధిలోని జీవదాత వృద్ధాశ్రమం లో కల్లుపల్లి గ్రామానికి చెందిన సామాజిక సేవా కర్త కె.చిన్న కుమార్తె కార్తికేయని పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో కేక్ కట్ చేశారు. అనంతరం కార్తికేయనిని వృద్ధులు ఆశీర్వదించారు. చిన్న మాట్లాడుతూ నిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటానని ఇందులో భాగంగానే నా కూతురు పుట్టిన రోజు కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్, అంజలి, రవి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని నెలసనపల్లి గ్రామం చెరువులో పేకాట ఆడుతున్నారని సమాచారంతో స్థానిక ఎస్సై సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐడి పార్టీతో కలిసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 50వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : చెన్నైలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో కడప జిల్లాకు చెందిన కరాటే యోధులు డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు స్వర్ణ పతకం సాధించారు. చెన్నైలో నిర్వహించిన ఈ కరాటే పోటీలలో వై.రూప్ సుదర్శన్ రాజు, నాగార్జున రజిత పతకాలతో రాణించారు. హరికష్ణ, కదిరి ధర్మతేజ కాంస్య పతకంతో రాణించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కరాటే ప్రెసిడెంట్, సెక్రటరీలు రామచంద్ర, రత్నాకర్ లు వీరిని అభినందించి ఘనంగా సన్మానించారు. త్వరలో జరగబోయే ఇంటర్నేషనల్ ఛాంపియన్షిప్‌లో పతకాలు సాధించాలని ప్రముఖులు, క్రీడాకారులు ఆకాంక్షించారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా విక్కీ



ప్రజాశక్తి-ఓజిలి: వాకాటివారికండ్రిగ గ్రామానికి చెందిన బొందికాయల విక్కీ యాదవ్‌ను ఓజిలి మండల వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించడంతో వైసీపీ నాయకులు షేక్ ఖాదర్ బాషా, మధుసూదన్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి విక్కీ యాదవ్‌ను ఆదివారం సన్మానించారు. విక్కీ యాదవ్ మాట్లాడుతూ తనను కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పుత్తూరు సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా మోహన్‌గాంధీ




ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండల వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా వేపగుంట గ్రామానికి చెందిన వైసీపీ యువనాయకుడు మోహన్‌గాంధీని ఎంపిక చేసినట్లు విజయవాడ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా మోహన్ గాంధీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పుత్తూరు మండల సోషన్ మీడియా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు ఇవ్వడంతో రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, మంత్రి సోదరులు కుమారస్వామిరెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ మునివేలు, ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్ యాదవ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని.. పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతానని పేర్కొన్నారు.

దత్త గ్రామాల్లో ఎన్‌ఎస్ఎస్ శిబిరం




ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో యూనిట్ దత్త గ్రామాలైనా కుంట్రపాకం, నాగూర్ కాలనీలో ఈనెల 12 నుంచి 18వ తేదీ వరకు జరుగనున్న ప్రత్యేక శిబిరం కోసం వాలంటీర్లు అర్థశాస్త్రం, న్యాయ విద్యార్థులకు మొదటి రోజు అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.ఎస్.మాధురి పరదేశి అసోసియేట్ ప్రొఫెసర్, న్యాయ విభాగాధిపతి విచ్చేసి వాలంటీర్లకు ప్రత్యేక శిబిరం ప్రాముఖ్యత, విద్యార్థుల పాత్ర, నిర్వహించాల్సిన కార్యక్రమల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా. పి.మాధవి, డా. ఎం.పద్మావతి వాలంటీర్లకు జరగబోయే ప్రత్యేక శిబిరం కార్య ప్రణాళికపై తెలిపారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొ. జే.కాత్యాయని ప్రత్యేక శిబిరం థీమ్ ను విద్యార్థులకు వివరించారు.

అంకాలమ్మ సేవలో గాలి భానుప్రకాష్



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గేటు పుత్తూరులోని అంకాలమ్మ సేవలో నగరి నియోజవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ కేశవాచారి ఆధ్వర్యంలో సొంత నిధులు వెచ్చించి నూతన అంకాలమ్మ దేవతను ప్రతిష్టించారు. అమ్మవారికి పూలమాలలు వేసి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మునిరాజాఆచారి, టీడీపీ నాయకులు ఎన్ఎన్ ధనపాల్, జీవరత్నంనాయుడు, డీజీ ధనపాల్, డీఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



ప్రజాశక్తి- పిచ్చాటూరు: మండలంలో రజానగరం, పాతశివగిరి, అడవికొడియంబేడు పంచాయతీల్లో వైసీపీ కార్యకర్తల కుంటుబ సభ్యులు మరణించడంతో ఆదివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ హరిశ్చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, సర్పంచ్ కె.జి రోస్ రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రాజు, తొప్పయ్య, పాల పద్మనాభం, మోహన్, చెంగల్రాయులురెడ్డి, వెంకటేష్, బాబు, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.